క్లుప్తంగా

మత్స్యావతారంలో జగన్నాథుడు



మత్స్యావతారంలో దర్శనమిచ్చిన జగన్నాథుడు

పార్వతీపురం టౌన్: రథోత్సవాల్లో భాగంగా జగన్నాథ స్వామి బుధవారం మత్స్యావతారంలో భక్తులకు బుధవారం గుండిచా మందిరంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి పట్టణ గ్రూపు దేవాలయాల ఈఓ ప్రసాద్ ఆధ్వర్యంలో గుండిచా మందిర ప్రధాన అర్చకుడు రమేష్ పండా వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, అర్చనలతో పాటు రుత్వికులు శాంతి హోమాలు జరిపించారు. ఈనెల 24వ తేదీ శనివారం హీరాపంచమి రోజున స్వామి వారు నరసింహ అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని ఈఓ తెలిపారు. అదేరోజు రాత్రి శ్రీ లక్ష్మీదేవి దర్శనం, తదితర పూజలు నిర్వహించనున్నామని తెలిపారు. అలాగే ఈనెల 28న మారురథ యాత్ర జరుగుతుందని, గుండిచా మందిరం నుంచి జగన్నాథ, బలభద్ర, సుభద్రా దేవిలను ఊరేగింపుగా ప్రధాన ఆలయం వద్దకు తీసుకు వచ్చి భక్తుల దర్శనార్థం ఉంచుతామని చెప్పారు.

ఆర్బీకేల్లో వరి విత్తనాల పంపిణీ



రైతుకు పీఎం కిసాన్ ఈకేవైసీ చేయిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: ఖరీఫ్ సీజన్‌కు గాను మండలంలోని రైతాంగానికి అవసరమైన వరి విత్తనాలు 20 రైతుభరోసా కేంద్రాల్లో పంపిణీ చేస్తామని ఏఓ ఎస్.అవినాష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన పెదబోగిలి ఆర్బీకేని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాలద్వారా ఇప్పటి వరకూ ఎంటీయూ 1064, ఎంటీయూ 1121, బీపీటీ 3291, బీపీటీ 5204, ఎంటీయూ 7029, ఆర్‌జీఎల్ 2537 రకాల వరి విత్తనాలు 1677 క్వింటాళ్లు పంపిణీ చేయనున్నామని చెప్పారు. అలాగే రైతు భరోసా కేంద్రాల వద్ద డీఏపీ, యూరియా 405 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.

పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోవాలి

జూన్‌నెల 30 లోగా పీఎం కిసాన్ ఈకేవైసీ రైతులు చేయించుకోవాలని ఏఓ ఎస్.అవినాష్ కోరారు. ఇప్పటికీ మండలంలోని 1270 మంది రైతులు చేయించుకోవాల్సి ఉందన్నారు. పొలాల గట్ల మీద వేయడానికి ఆర్బీకేల్లో కంది విత్తనాలు ఉన్నాయని తెలియజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నీడ్ సంస్థ ప్రతినిధి వేణుగోపాలరావు

పాచిపెంట: చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని... క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని నీడ్ సంస్థ ప్రతినిధి పి.వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని పెదకంచూర గ్రామంలో గిరిజన గ్రామాల యువతకు నీడ్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలు సతాబి, కేరంగి జట్లకు బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దొనేరు లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పెంపకానికి ప్రతిపాదనలు

తెర్లాం: ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో ఉద్యాన పంటల పెంపకానికి అవసరమైన నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో సమావేశమైన ఆయన మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని, పనులు జరిగిన వెంటనే వేతనదారులకు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వర్షాకాలంలో ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉద్యాన పంటలు పెంపకానికి అవసరమైన పనులు గుర్తించాలని, నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన అన్ని రికార్డులను సిద్ధం చేయాలన్నారు. మండలంలో జరుగుతున్న పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, ఎటువంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఉపాధి ఏపీఓ కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

యోగాతో రోగాలన్నీ మటుమాయం

సీతానగరం:

మందులతో నయం కాని కొన్ని వ్యాధులు యోగాతోనే మటుమాయం అవుతాయని బూర్జ ఆయుష్ వైద్యాధికారిణి టి.హేమాక్షి, డాక్టర్ ప్రసన్న కుమార్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బూర్జ ఎంఎస్పీ(ఆరోగ్యకేంద్రం) కార్యాలయం, ఆయుష్ ఆవరణలో యోగాసనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ యోగవిద్య పట్ల విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని, యోగాసనాలు ఆరోగ్య ప్రదాయిని అని అన్నారు. యోగాసనాలు వేస్తున్న వారికి ఆరోగ్యపరమైన సమస్యలుండవని, అలాగే యోగావిద్య నభ్యశించిన విద్యార్థుల్లో జ్ఞాపక శక్తి, శరీర దారుఢ్యం పెరుగుతుందని, వ్యాధులు దరిచేరకుండా ఉంటాయన్నారు. అనంతరం వివిధరకాల యోగాసనాలను ఇన్‌స్ట్రక్టర్ వేసి చూపించారు.



సీతానగరం: శీర్షాసనం వేసిన ఎస్ఎస్ఎస్ పీఓ టి.రవికుమార్



బలిజిపేట: ఉపాధి పనుల వద్ద వేతనదారులతో యోగాసనాలు వేయించిన అధికారులు



కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



సీతానగరం: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



పార్వతీపురం: భగవద్గీత గురించి వివరిస్తున్న రామ్మోహనరావు

ఇతర విద్యాలయాల్లో..

అంతర్జాతీయ మోగాదినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని బగ్గందొరవలస విద్యాలయంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు యోగాసనాలు వేయించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ బి రేణుక, ఎన్ఎస్ఎస్ పీఓలు టి.రవికుమార్, డి రామకృష్ణ, ఆసనాలు వేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, వలంటీర్లు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పార్వతీపురం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, స్వామిసేవాసమితి కార్యదర్శి కంచుమోజు రామ్మోహనరావు అన్నారు. స్థానిక బైపాస్ రోడ్డులో గల శ్రీ షిర్డీసాయి బాబా యోగా మందిర కేంద్రంలో జరిగిన యోగా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా ఆవశ్యకతను, భగవద్గీత గురించి పలు విషయాలను వివరించారు. అనంతరం యోగా బృందం సభ్యులు ఎంవీ రాఘవేంద్ర, వెంకటరమణ, జల్లు రామకృష్ణ తదితరులు రామ్మోహనరావును ఘనంగా దుశ్శాలువతో సన్మానించి సత్కరించారు.

ఆరోగ్యానికి రక్ష యోగా

బలిజిపేట: యోగా ఆరోగ్య రక్షగా ఉపయోగపడుతుందని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆమె అమృత సరోవర్ చెరువుల వద్ద శివరాంపురం, పణుకువలస, బర్లి, వెంగాపురం, పలగర, చిలకలపల్లి, గలావల్లి, సుభద్ర గ్రామాలలో వేతనదారులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా ఆరోగ్యానికి ఎంతో రక్షణ ఇస్తుందని తెలిపారు. వృద్ధులైనా యోగా చేయడంతో ఆరోగ్యసమస్యలు తీరుతాయన్నారు. అందరూ తప్పనిసరిగా యోగాను నిత్యకృత్యం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం ఏఓ భానుమూర్తి, ఏపీఓ కేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

• జూనియర్ సివిల్ జడ్జి రమేష్



సాలూరు: కోర్టు ఆవరణలో వేస్తున్న యోగా ఆసనాలు



సాలూరు: వైటీసీలో యోగాసనాలు వేస్తున్న గర్భిణులు



మక్కువ: సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్‌లో యోగా చేస్తున్న అసిస్టెంట్ కమాండెంట్ ఆశ

సాలూరు: యోగాతో మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి రమేష్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో పట్టణంలో.. నీడ్ డైరెక్టర్ వేణుగోపాలరావు ఆధ్వర్యంలో వైటీసీలోని గిరిశిఖర గర్భిణుల వసతిగృహం, తదితర ప్రాంతాల్లో ర్యాలీలు, యోగాసనాలు వేసి యోగా ఆవశ్యకతను వివరించారు. కోర్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రమణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, సభ్యులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా..

మక్కువ: స్థానిక సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంట్ ఆశుకుమారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ ఆశుకుమారి యోగా ప్రాముఖ్యతను వివరించారు. అలాగే మండలంలోని వెంకటభైరిపురం జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఎం పద్మావతి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు . ఎస్‌బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో కన్నంపేట, చప్పబుచ్చమ్మపేట, శంబర, పనసబద్ర, కొయ్యానపేట, కాశీపట్నం గ్రామాలలో అమృత సరోవర్ చెరువుల వద్ద ఉపాధి వేతనదారులతో యోగా నిర్వహించారు.

అభినందనలు

సాలూరు: పట్టణ వైశ్యకుల సంఘ నూతన కార్యవర్గానికి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గిరి రఘు, జర్జాపు సూరిబాబు, రాపాక మాధవరావు, పువ్వల శ్రీనివాసరావు, కర్రి వెంకటరావు, ఈ.నారాయణరావు, తదితరులు అభినందనలు తెలిపారు. సంఘం ప్రెసిడెంట్‌గా మండవిల్లి సాంబశివరావు, సెక్రటరీగా నాగసాయి, కోశాధికారిగా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులను బుధవారం స్థానిక రామా థియేటర్ వద్ద అభినందించారు.

జగనన్న సురక్ష ద్వారా సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన జగనన్న సురక్ష పథకం గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి దోహద పడుతుందని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు బుధవారం చినబోగిలి సచివాలయంలో సర్పంచ్ కురమాన రాధ అధ్యక్షతన జగనన్న సురక్ష పథకం అమలుపై గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో జగనన్న భూరక్ష, భూహక్కు పథకం ద్వారా రైతులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కార మవుతున్నాయన్నారు. అలాగే సమస్యలు ఎన్ని ఉన్నా నిర్దేశించిన వివిధ శాఖల అధికారులతో వాటికి పరిష్కారం చూపుతారని చెప్పారు. ఇంటింటికి రానున్న అధికార సిబ్బందికి ప్రజలు వారి సమస్యలను వివరించి పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జి బుజ్జి, మండల సర్వేయర్ శంకరరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు లక్ష్మి పి.కుమార్, మాజీ సర్పంచ్‌లు ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకంపై అవగాహన కల్పించుకున్న సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో ప్రజలకు గ్రామసభలు ఏర్పాటు చేసి తెలియజేయాలన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్వీ రమణ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు సచివాలయ ఉద్యోగులతో జగనన్న సురక్ష పథకం అమలుపై సమీక్షా సమావేశం జరిగింది.

మహిళలు జీవనోపాధి మెరుగుపరుచుకోవాలి

బలిజిపేట:

మహిళా సంఘాలకు అందుతున్న ఆర్థిక సహకారంతో మహిళలు జీవనోపాధి మెరుగుపరుచుకోవాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ సూచించారు. ఈ మేరకు బలిజిపేట వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మహిళా సంఘాలతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాల లబ్ధిని వారి ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. అదే విధంగా మహిళా సంఘాల ద్వారా రుణాలను మంజూరుచేస్తోందని వాటితో గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు వివిధ రకాలైన జీవనోపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని హితవు పలికారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే సంకల్పంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి వారికి అత్యంత ప్రాధాన్యం కల్పిస్తున్నారన్నారు. రుణాలు తీసుకోవడం, వాటిని సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీ పొందడం , సంఘాలను సక్రమంగా నడిపించుకోవడం చేయాలని సూచించారు. ఏ సంఘం మూతపడకుండా నడిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం ఉమామహేశ్వరరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు మేరీ, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

వైఎస్సార్ పశుబీమాపై అవగాహన తప్పనిసరి

పాచిపెంట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశు బీమా పథకం పై పాడి రైతులు అవగాహన పెంపొందించుకోవాలని పశుసంవర్థక శాఖ జె.డి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గురువునాయుడుపేటలో సర్పంచ్ గొట్టాపు చిటెమ్మ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడి పశువులకు సంబంధించి మూడు సంవత్సరాలకు 397 రూపాయలు చెల్లిస్తే.. ప్రమాదవశాత్తూ అవి మరణిస్తే 30 వేల రూపాయల బీమా వర్తిస్తుందని చెప్పారు. అదేవిధంగా గొర్రెలు, మేకలకు 76 రూపాయలు చెల్లిస్తే ఆరు వేల రూపాయల పరిహారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోరిపల్లి ధనుంజయరావు, పశు సంవర్థక శాఖ ఎ.డి సన్యాసిరావు, వైద్యాధికారి ఎం.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

బాడంగి: నారుమడుల్లో ధాన్యం విత్తనాలు చల్లే ముందు వాటిని శుద్ధి చేయాలని రేజేరు వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్) సాయికుమార్ సూచించారు. మండలంలోని రేజేరు గ్రామ ఆర్‌బీకే(రైతు భరసా కేంద్రం) వద్ద రైతులకు బుధవారం విత్తనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విత్తనాలు శుద్ధి చేసి, పొలాల్లో చల్లడం ద్వారా పంటకు పట్టే చీడ పీడలు, తెగుళ్లను నివారించవచ్చన్నారు. ఈ నేపథ్యంలో వేరుకుళ్లు తెగులు సోకకుంటే మొలక శాతం పెంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం విత్తనాలతో పాటు వాటిని శుద్ధి చేసేందుకు అవసరమైన సూడో మోనాస్ పౌడర్ ప్యాకెట్లను కూడా అందజేశారు. కౌలురైతులు వీఆర్‌ఓల నుంచి సీసీఆర్‌సీ కార్డులు తీసుకువస్తే విత్తనాలు అందిస్తామని, అలాగే పీఎం కిసాన్ కోసం ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ బి.రమేష్, సర్పంచ్ వెంకటనాయుడు, ఏఏబీ చైర్మన్ బి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

బ్యాంకింగ్‌పై అవగాహన అవసరం

• లీడ్‌బ్యాంక్ మేనేజర్ మూర్తి

పార్వతీపురం:

బ్యాంకింగ్ సేవలపై విద్యార్థులకు అవగాహన అవసరమని లీడ్‌బ్యాంక్ మేనేజర్ జేఎల్ఎన్ మూర్తి అన్నారు. రిజర్వ్‌బ్యాంకు ఇండియా సూచనల మేరకు ఆర్థిక లావాదేవీలపై పార్వతీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం పలు విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే పొదుపుపై దృష్టి ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు బ్యాంకు మోసాలకు పాల్పడుతుంటారని, వాటిపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని హితవు పలికారు. ఈ సందర్భంగా బ్యాంకింగ్ సేవలపై విద్యార్థులకు క్విజ్‌పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 11 పాఠశాలల జట్లు పాల్గొన్నాయి. ఇందులో పార్వతీపురంలోని కేపీఎం హైస్కూల్ బృందం మొదటి బహుమతి గెలుచుకుంది. ఈ జట్టు ఈ నెల 28న నిర్వహించనున్న జిల్లాస్థాయి క్విజ్‌కు అర్హత సాధించింది. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రవిశంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంపొందించడానికే పోటీ పరీక్షలు

సీతానగరం: విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడానికి, వారిలో చైతన్యం కల్గించడానికి, బ్యాంకింగ్ వ్యవస్థపై నమ్మకం కల్గించడమే క్విజ్ పోటీల ముఖ్య ఉద్దేశమని యూనియన్ బ్యాంక్ బీఎం కె.జగదీష్ అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈఓ జి.సూరిదేముడు పర్యవేక్షణలో 9 పాఠశాలల విద్యార్థులకు వివిధ అంశాలపై పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెరగడానికి, పోటీ పరీక్షల్లో చైతన్యవంతులవడానికి, విజ్ఞానం పెంపొందించడానికి రిజర్వ్ బ్యాంక్ ఇటువంటి అవకాశం కల్పించిందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే బ్యాంకింగ్ వ్యవస్థలో వస్తున్న మార్పులను ప్రజలకు తెలియజేసేందుకు విద్యార్థులు ముందుగా అవగాహన కల్పించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఆర్ వెంకంపేట ఉన్నత పాఠశాలకు ప్రథమం,నిడగల్లు ఉన్నత పాఠశాలకు ద్వితీయం, సీతానగరం ఉన్నత పాఠశాలకు తృతీయ బహుతులు వచ్చాయని నిర్వాహకులు తెలియజేశారు. మండల స్థాయిలో విజయం సాధించిన వారు ఈనెల 28న జరగనున్న జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు హాజరు కావాలని కోరారు.



సీతానగరం: విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ బీఎం జగదీష్, ఎంఈఓ, హెచ్ఎం

శరవేగంగా వంద పడకల ఆస్పత్రి నిర్మాణం



వంద పడకల ఆస్పత్రి భవనం



ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు బొత్స సత్యనారాయణ, పీడిక రాజన్నదొర (ఫైల్)

• మంత్రి రాజన్నదొర కృషితో ఆస్పత్రి మంజూరు

సాలూరు: ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక కృషితో మున్సిపాలిటీలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సాలూరులో 1950లో పది పడకలతో ఆస్పత్రి ఏర్పాటు చేయగా.. 1954లో 18 పడకలకు పెంచారు. దీన్ని 1979లో 30 పడకలకు పెంచారు. అప్పటి నుంచి రోగుల తాకిడి ఎక్కువగా ఉండడంతో వైద్యసేవలు అందించేందుకు సిబ్బందికి ఇక్కట్లు తప్పేవి కావు. ఒక్కో పడక మీద ఇద్దరేసి రోగులకు వైద్యం అందించిన పరిస్థితులు కూడా ఉన్నాయి. సాలూరు, పాచిపెంట, మక్కువ, తదితర ప్రాంతాల నుంచి ఈ ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అలాగే జాతీయ రహదారి 26, ఘాట్‌రోడ్లపై తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో క్షతగాత్రులను సాలూరు ఆస్పత్రికే తీసుకువస్తుంటారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆస్పత్రి స్థాయిని పెంచాల్సిన అవసరం ఏర్పడింది.

ఫలించిన రాజన్నదొర కృషి..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సాలూరులో వంద పడకల ఆస్పత్రి ఆవశ్యకతను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి మంత్రి రాజన్నదొర తీసుకెళ్లారు. దీంతో సీఎం సుమారు 17 కోట్ల రుపాయల నాబార్డు నిధులు మంజూరు చేయడంతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రారంభంలో స్థల సమస్య రాగా.. మంత్రి జిల్లా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించారు. భవన నిర్మాణాలకు మంత్రి బొత్స సత్యనారాయణతో కలిసి మంత్రి రాజన్నదొర శంకుస్థాపన చేయగా.. మొదట్లో పనులు నత్తనడకన సాగాయి. వెంటనే విషయం గమనించిన రాజన్నదొర సంబంధిత కాంట్రాక్టర్, అధికారులతో మాట్లాడి పనులు వేగవంతం చేయించారు.

ప్రచారాలు మీవి.. పనులు మావి..

వందపడకల ఆస్పత్రి నిర్మిస్తామని టీడీపీ హయాంలో నాటి మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు ఆదరాబాదరాగా శంకుస్థాపన చేశారు. కాని ఒక్క పని కూడా జరగలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక, పీడిక రాజన్నదొర మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక పనులు జోరుగా సాగుతున్నాయి.

అభివృద్ధి పనులు వేగవంతం

• డిసెంబరు నాటికి శతశాతం పూర్తి
• పంచాయతీరాజ్ ఎస్ఈ డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ



సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ ఎస్ఈ డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, డ్వామా పీడీ రామచంద్రరావు

పార్వతీపురం టౌన్: జిల్లాలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం పనులకు వెంటనే చెల్లింపులు జరుగుతున్నట్లు, పనులు వేగవంతం చేసినట్లు జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన తన కార్యాలయంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్రరావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నూతన జిల్లా ఏర్పడిన తరువాత కలెక్టర్, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కాంట్రాక్టర్లకు బకాయిలు మొత్తం చెల్లిస్తున్నామని, ఇకముందు కూడా పనులు పూర్తయిన వెంటనే సకాలంలో బిల్లుల చెల్లింపు జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 313 గ్రామ సచివాలయాలు, 302 రైతు భరోసా కేంద్రాలు, 196 వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం మొదలు పెట్టామని, వాటిలో 122 సచివాలయాలు, 84రైతు భరోసా కేంద్రాలు, 22 వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం పూర్తయ్యాయని, 75శాతం నిర్మాణం పూర్తయిన భవనాలు సెప్టెంబరు నాటికి, మిగిలిన భవనాలు డిసెంబరు నాటికి పూర్తి కానున్నాయని తెలిపారు.

262 అభివృద్ధి పనుల పూర్తి

జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్రరావు మాట్లాడుతూ నరేగా ద్వారా గడిచిన రెండు సంవత్సరాలలో పూర్తిచేసిన, ప్రస్తుతం జరుగుతున్న పనులకు సంబంధించిన బిల్లులకు అరవై రెండు కోట్ల రూపాయలను గడిచిన రెండు నెలలో చెల్లించినట్లు తెలిపారు. పనులకు సంబంధించిన బిల్లులు అప్‌లోడ్ చేసిన వెంటనే చెల్లింపులు జరుగుతాయని, చేసిన పనులకు వెంటనే చెల్లింపులు జరుగుతున్నందున, నిర్మాణంలో గల భవనాల నిర్మాణాలు వేగవంతంచేసి సెప్టెంబరు నాటికి పూర్తిచేసేందుకు చర్యలుతీసుకుంటున్నట్లు చెప్పారు.